# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-03-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో డిఎస్సీ పరీక్ష, టెట్ ఫలితాల విడుదల వాయిదా పడ్డాయి.**

2. **సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో వాలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయించవద్దని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు.**

3. **తెలంగాణా రాష్ట్రంలో వేసవి కారణంగా విద్యుత్, తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**

4. **క్రైస్తవులు ఈరోజు ఈస్టర్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.**

5. **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రాగల మూడు రోజుల్లో వడగాలుల తీవ్రత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసే వరకు టెట్ ఫలితాలు, డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా ఆదేశించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఇప్పటికే డీఎస్సీ షెడ్యూల్ లో పాఠశాల విద్యాశాఖ మార్పులు చేసింది. మార్చి 30 నుంచి ఏప్రిల్ 30 వరకు పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి డీఎస్సీ వాయిదా వేయాలంటూ తాజాగా ప్రకటన చేశారు. మరోవైపు ఉపాధ్యాయ అర్హత పరీక్ష – టెట్ ఫలితాలను మార్చి 14నే విడుదల చేయాల్సి ఉండగా ఇంతవరకు విడుదల కాలేదు.

--------------------------

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో వాలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయించవద్దని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్ కుమార్‌మీనా అధికారులను ఆదేశించారు. హైకోర్టు ఆదేశాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు వాలంటీర్లకు ఇచ్చిన ట్యాబ్, మొబైల్ డిపాజిట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నగదు పంపిణీ పథకాల్లో ప్రభుత్వ ఉద్యోగుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

--------------------------

తెలంగాణగా రాష్ట్రంలో వేసవి కారణంగా విద్యుత్, తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కరెంటు కోతలు ఉండొద్దని స్పష్టం చేశారు. వేసవిలో విద్యుత్, తాగునీటి సరఫరాపై అధికారులతో నిన్న అయన సమీక్ష నిర్వహించారు. పెరిగిన డిమాండ్‌కు తగినట్టు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. పంటలు ఎండిపోకుండా చూడాలని అన్నారు. 'రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి కొరత లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలని, జూన్ వరకు బోర్లు, బావులు, ఇతర స్థానిక నీటి వనరులు వాడుకోవాలని దిశానిర్దేశం చేశారు. తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్లు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అన్నారు. గ్రామాల వారీగా కార్యాచరణ తయారు చేయాలని, పర్యవేక్షణ కోసం జిల్లాస్థాయిలో ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వాటర్ ట్యాంకులు సిద్ధంగా ఉంచాలని, ట్యాంకర్లు బుక్ చేస్తే 12 గంటల్లోపు చేరేలా చూడాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రజాగళంలో భాగంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో జరిగిన బహిరంగ సభలో నిన్న అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... తాము అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని అన్నారు. ఇలాఉండగా బాపట్లలో ఈరోజు జరిగే బహిరంగ సభలో చంద్రబాబునాయుడు పాల్గొంటారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ప్రకటించారు. పేద మహిళలకు నెలకు 8 వేల 500 రూపాయల చొప్పున ఏడాదికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేస్తామని ఆమె వెల్లడించారు. 'గడప గడపకు కాంగ్రెస్' ప్రచార కార్యక్రమాన్ని షర్మిల విజయవాడలో నిన్న ప్రారంభించి, 9 గ్యారంటీలను ప్రకటించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం అని షర్మిల అన్నారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు వచ్చిన 15 వందల దరఖాస్తులపై సర్వేలు చేశామని... అభ్యర్థి పనితీరు, రాష్ట్ర నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేస్తున్నట్లు పేర్కొన్నారు.

---------------------------

ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఈరోజు ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఏసుక్రీస్తు పునరుత్థానం జ్ఞాపకార్థం జరుపుకునే క్రైస్తవ పండుగ ఈస్టర్. వసంతం మొదలైన తర్వాత మొదటి పౌర్ణమి తర్వాత వచ్చే ఆదివారం నాడు ఈస్టర్ పండుగ జరుపుకుంటారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రాగల రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుతాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణం ఏర్పడే అవకాశముందని తెలిపింది. ఈరోజు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, వైయస్ఆర్ జిల్లాల్లో వడగాలులు వీయనున్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ కేంద్రం ప్రకటించింది. 'సోమవారం ఒక మండలంలో తీవ్ర, మరో 64 మండలాల్లో సాధారణ స్థాయిలో వడగాలులు వీస్తాయని తెలిపింది. శనివారం విజయనగరం, అనకాపల్లి,

నంద్యాల, వైయస్ఆర్ జిల్లాల్లో తీవ్ర వడగాలులు, మరో 52 మండలాల్లో ఓ మాదిరి వడగాలులు వీచాయని వివరించింది. అత్యధికంగా నంద్యాల జిల్లా అవుకులో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని తెలిపింది.

---------------------------

తెలంగాణా రాష్ట్రానికి వడగాలుల ముప్పు పొంచి ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈరోజు నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు పగటిపూట వడగాలులు వీచే పరిస్థితులు ఉన్నట్లు ప్రకటించింది. ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాలతోపాటు ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు సూచనలు జారీ చేసింది. రాష్ట్రంలో కొద్ది రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రత 43 డిగ్రీల సెల్సియస్‌ను తాకింది. రాత్రుళ్లు కూడా సాధారణం కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉంటాయని పేర్కొంది. రాష్ట్రంలో 16 జిల్లాలకు పసుపు రంగు హెచ్చరికలు జారీ చేశారు. శనివారం వేములపల్లి మండలంలో 42.7 డిగ్రీలు, నిడమనూరు మండలంలో 42.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖమ్మంలో సాధారణం కన్నా 4.2 డిగ్రీలు అధికంగా 40.4 డిగ్రీలు నమోదైందని అధికారులు తెలిపారు.

---------------------------

భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు, తెలంగాణా మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖరరావు ఈ రోజు మూడు జిల్లాల్లో పర్యటించనున్నారు. జనగామ, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో సాగునీరందక నష్టపోయిన పంటలను పరిశీలించి, రైతులను పరామర్శించనున్నారు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో భాగంగా ఈరోజు 3 గంటల 30 నిమిషాలకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య మ్యాచ్ జరగనుంది. మరో మ్యాచ్ సాయంత్రం 7 గంటల 30 నిమిషాలకు ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య విశాఖపట్నంలో జరగనుంది.

నిన్న లఖ్నోలో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు 21 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్ జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన లక్నో జట్టు 8 వికెట్లకు 199 పరుగులు చేసింది. 200 పరుగుల లక్ష్యాన్ని చేరుకునేందుకు బ్యాటింగ్ ఆరంభించిన పంజాబ్ జట్టు నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లకు 178 పరుగులు చేసింది.

---------------------------

బహిరంగ ప్రదేశాల్లో ఫోన్ ఛార్జింగ్ చేయొద్దని ప్రభుత్వ సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ.. కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ ఆఫ్ ఇండియా హెచ్చరించింది. బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటుచేసిన యూఎస్‌బీ ఛార్జింగ్ స్టేషన్‌లను ఆసరాగా చేసుకొని సైబర్ దాడులకు పాల్పడుతున్నారని వెల్లడించింది. వినియోగదారుల వ్యక్తిగత డేటాను దొంగిలించడం లేదా వారి పరికరాల్లో మాల్వేర్‌ను ఇన్‌స్టాల్ చేయడం కోసం ఛార్జింగ్ పోర్ట్స్ ఉపయోగించుకుంటున్నారని పేర్కొంది. ఈ తరహా దాడులనే జ్యూస్ జాకింగ్ అంటారని.. వీటితో జాగ్రత్త వహించాలంటూ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ ఆఫ్ ఇండియా సూచించింది.

---------------------------

గత ప్రభుత్వానికి, తమ ప్రభుత్వానికి మధ్య తేడా ఊరూరా స్పష్టంగా కనిపిస్తోందని వైఎస్ ఆర్ సీపీ

అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 'మేమంతా సిద్ధం' పేరుతో నిర్వహిస్తున్న బస్సు యాత్ర నిన్న కర్నూలు జిల్లాలోని పత్తికొండ నియోజకవర్గంతో పాటు అనంతపురం జిల్లాలోనూ కొనసాగింది. తుగ్గలి, రాతన గ్రామస్తులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని.. ఈ మార్పులు కొనసాగడం చాలా అవసరం అని అభిప్రాయం వెలిబుచ్చారు.

---------------------------

తమ కూటమి అధికారంలోకి రాగానే పిఠాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. తాను పోటీ చేస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురంలో నిన్న పవన్‌కళ్యాణ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే ఆసుపత్రులన్నీ బాగు చేస్తామని... పిఠాపురంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి కోసం పిఠాపురంలో 20 సెక్టార్లలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

---------------------------

మచిలీపట్నం లోక్‌సభ స్థానం నుంచి జనసేన పార్టీ తరపున వల్లభనేని బాలశౌరిని అభ్యర్థిగా ఖరారు చేస్తూ ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నిర్ణయం తీసుకున్నారని పార్టీ రాజకీయకార్యదర్శి సి.హరిప్రసాద్ తెలిపారు. అవనిగడ్డ, పాలకొండ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉందని ఆయన వెల్లడించారు.

---------------------------

న్యాయ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి న్యాయ సదస్సులు దోహదపడతాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.నాగరత్న అన్నారు. శామీర్‌పేటలోని జస్టిస్ సిటీ నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో 'న్యాయస్థానాలు–రాజ్యాంగం' అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల సదస్సు ప్రారంభోత్సవానికి నిన్న ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.

=====================